క్లుప్తంగా

సీఎంకు రుణపడి ఉంటాం

అమడగూరు: ఎమ్మెల్సీ పదవుల్లో బీసీలకు పెద్దపేట వేసిన సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని రాష్ట్ర భట్రాజుల సంఘం డైరెక్టర్ మధుసూదన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా బీసీలకు ఇంతటి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. బీసీలంతా వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా ఉంటారన్నారు.

బీసీలకు పెద్దపీట

కదిరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్ద పీట వేస్తున్నారని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ జగన్‌మోహన్ యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాసనమండలిలో త్వరలో వైఎస్సార్‌సీపీ బలం 44కు పెరగనుండగా అందులో బీసీలు 19మంది, ఎస్సీలు 6 మంది, ఎస్టీ ఒకరు, మైనార్టీలు నలుగురు ఉంటారని తెలిపారు. చంద్రబాబు సామాజిక అన్యాయానికి పాల్పడితే సీఎం వైఎస్ జగన్ ఆయా వర్గాల సాధికారత కోసం పని చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డి తరఫున ప్రచారం



జెడ్పీటీసీ కోటి సుధను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న హరినాథరెడ్డి

బత్తలపల్లి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన సోదరుడు హరినాథ్‌రెడ్డి అభ్యర్థించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి ఉద్యోగులను, జెడ్పీటీసీ కోటి సుధ, ఇతర ప్రజాప్రతి నిధులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. సచివాలయాల కన్వీనర్ జయరామిరెడ్డి, కోటి సురేష్, రాంభూపాల్‌రెడ్డి, వీరారెడ్డి, చింతకాయల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత



పుస్తకాలను అందజేస్తున్న ఎంఎస్ కిరణ్

కదిరి అర్బన్: మాధవ గురుకులంలోని విద్యార్థులకు మానసధార స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఎంఎస్ ప్రశాంత్, ఎంఎస్ కిరణ్ మంగళవారం రూ.50 వేల విలువైన పుస్తకాలను అందజేశారు.

మామిడి చెట్లు అగ్నికి ఆహుతి

నల్లమాడ: బొగ్గలపల్లి సమీపాన అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి దుండగులు అడవికి నిప్పు పెట్టారు. దీంతో మంటలు వ్యాపించి సమీపంలో 10 ఎకరాల్లో సాగుచేసిన 600 మామిడి చెట్లు, సోలార్ పంప్‌సెట్, డ్రిప్పు పరికరాలు దగ్ధమైనట్లు బాధిత రైతులు నారాయణస్వామి, నాగరాజు, సూరిబాబు, గంగులప్ప మంగళవారం తెలిపారు. లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు.

నేటి నుంచి దాదులూరు పోతలయ్య పరుష



పోతలయ్యస్వామి, చెన్నకేశవస్వామి మూర్తులు

కనగానపల్లి: దాదులూరు పోతలయ్యస్వామి జాతర నేటి నుంచి మూడు రోజులు పాటు జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి తెలిపారు. బుధవారం యలవగంప ఊరేగింపుతో జాతర ప్రారంభమవుతుందన్నారు. రామగిరి మండలం గంతిమర్రి నుంచి ప్రారంభమయ్యే ఈ ఊరేగింపు ద్వారా పోతలయ్యస్వామి కాపులు స్వామి వారి ఆభరణాలను బుట్టలో తీసుకొని వచ్చి అలంకరణ చేస్తారన్నారు. రెండో రోజు గురువారం పోతలయ్య, చెన్నకేశవ స్వాములకు జ్యోతుల మహోత్సవం, మూడో రోజు శుక్రవారం వేకువజామునే తొమ్మిది మంది పోతురాజుల చేత స్వామి వారికి మేక పిల్లలను బలి ఇచ్చే గావుల మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

చెరువుకు జలకళ.. ఆయకట్టు కళకళ

- కృష్ణా జలాలతో నిండిన బుక్కపట్నం చెరువు
- రెండు పంటలకు సమృద్ధిగా నీరు
- ప్రభుత్వ తోడ్పాటుతో ఉత్సాహంగా పంటల సాగు
- కూలీలకు చేతినిండా పని
- కులవృత్తులకూ పూర్వ వైభవం



నిండుగా జలంతో కళకళలాడుతున్న బుక్కపట్నం చెరువు



బుక్కపట్నం చెరువు కింద కళకళలాడుతున్న వరి పొలాలు

కొత్తచెరువు: పాలకుల సంకల్పం మంచిదైతే ప్రకృతి కూడా సహకరిస్తుందనేందుకు బుక్కపట్నం కింద అలరారుతున్న పచ్చదనమే నిదర్శనం. అటు వరుణ దేవుడి కృప, ఇటు కృష్ణాజలాల రాకతో జలశోభను సంతరించుకున్న శ్రీసత్యసాయి జిల్లాలోనే అతిపెద్దదైన బుక్కపట్నం చెరువు అన్నదాతలకు అండగా నిలిచింది. ఈ చెరువు కింద వేలాది ఎకరాల్లో సాగైన పంటలతో ఎటు చూసినా పచ్చదనం కనిపిస్తోంది. చెరువుల కింద విస్తారంగా పంటలు సాగులో ఉండటంతో కూలీలకు చేతినిండా పని లభిస్తోంది. గత ప్రభుత్వాలు చెరువుల అభివృద్ధిని విస్మరించడంతో ఆయకట్టు బీడుపడి వ్యవసాయం కుంటు పడేది. దీంతో అటు కులవృత్తులు చేసుకునేవారు పట్టణాలకు వలస వెళ్లారు. ప్రస్తుతం చెరువులు నిండి పొలాలు సస్యశ్యామలం కావడంతో కులవృత్తుల వారు తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారు. వ్యవసాయానికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

కృష్ణా జలాల రాకతో ఆయకట్టు సస్యశ్యామలం

సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టినప్పటినుంచి అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు. జలవనరులను వృథా చేయకుండా చెరువులను నీటితో నింపేందుకు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా బుక్కపట్నం చెరువుకు మూడు పర్యాయాలు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణజలాలు నింపారు. ఈ చెరువుకు కృష్ణా జలాలను విడుదల చేయించడంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కృషి చేశారు. ఈ చెరువు కింద 3112 ఎకరాల ఆయకట్టు ఉండగా మరో 8 వేల ఎకరాలకు పైబడి పంటలు సాగులో ఉన్నాయి. ప్రధానంగా ఏడాదికి రెండు పర్యాయాలు రైతులు వరిపంట సాగు చేస్తూ ఉత్తమ దిగుబడులు సాధిస్తున్నారు. గతంలో దశాబ్దాల తరబడి బీడుపడిన భూములు నేడు కృష్ణాజలాల రాకతో పచ్చగా మారాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగు జలాలకు ఎలాంటి లోటు లేకపోవడంతో పంటల సాగుకు ధైర్యంగా ముందుకు సాగుతున్నాయని, దీనికితోడు ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు పురుగుల మందులు సకాలంలో సబ్సిడీపై అందిస్తుండడంతో వాటిని సద్వినియోగం చేసుకొని పంటలలో అధిక దిగుబడులు సాధిస్తున్నట్లు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుక్కపట్నం చెరువుతోపాటు మండల వ్యాప్తంగా ఉన్న 22 చెరువులు జలకళ సంతరించుకున్నాయి. దీంతో బోర్లలోనూ నీరు సమృద్ధిగా లభిస్తోంది. వరి, వేరుశనగ, మొక్కజొన్న, టమాట, పొద్దుతిరుగుడు తదితర పంటలను రైతులు సాగులోకి తెస్తున్నారు.

రెండు పంటలు తీస్తున్నాం



బుక్కపట్నం చెరువులో నీరు సమృద్ధిగా ఉండడంతో యేడాదికి రెండు పంటలు తీస్తున్నాం. 20 ఎకరాల్లో వరి, వేరుశనగ సాగు చేశాను. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి బుక్కపట్నం చెరువుకు కృష్ణాజలాలు విడుదల చేయడం మాకు ఎంతో ఊరటనిచ్చింది.

బాబు, రైతు, కొత్తచెరువు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నల్లమాడ: ప్రమాదాల్లో గాయపడిన, మృతి చెందిన, అనారోగ్యాలకు గురైన బాధితుల కుటుంబాలను ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. అనారోగ్యంతో ఈనెల 17న మృతి చెందిన యర్రవంకపల్లికి చెందిన మీసాల రమణయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా రెడ్డిపల్లిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముస్తఫా(69), కేరళలో మృతిచెందిన మోదీన్‌బాషా, అనారోగ్యంతో మృతిచెందిన నరసింహులు కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

పుట్టపర్తి అర్బన్: కంబాలపర్తి కి చెందిన రమణమ్మ, రమణప్ప కుమారుడు అశోక్ వారం రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందజేశారు. ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ హనుమంతరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.



రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: చెర్లోపల్లి కొండపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయం, కాశిరెడ్డి నాయన ఆశ్రమ అభివృద్ధికి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు.

వైఎస్సార్‌సీపీ బడుగు, బలహీన వర్గాల పార్టీ

- కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శాసనమండలిలో భర్తీ చేయనున్న 18 ఎమ్మెల్సీ స్థానాలకు గాను 14 స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లలో ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో మండలిలో టీడీపీకి 48 మంది సభ్యులుంటే అందులో బీసీ, ఎస్టీ, ఎస్సీలు కేవలం 18 మందే(37శాతం) ఉండేవారని, వైఎస్సార్‌సీపీ హయాంలో 44 మందికి గాను 30 మంది(68శాతం) బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే ఉన్నారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ బీసీల ఓట్లను దండుకోవడమే తప్పా వారికి చేసింది శూన్యమన్నారు. సీఎం వైఎస్ జగన్ బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. వాల్మీకి వర్గానికి చెందిన దివంగత మాజీ ఎంపీ గంగాధర్ సతీమణి మంగమ్మకు ఎమ్మెల్సీ సీటు కేటాయించడం అభినందనీయమన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

గంగమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

కదిరి అర్బన్: కాళసముద్రం గ్రామంలో మంగళవారం జరిగిన యర్రదొడ్డి గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి పాల్గొని పూజలు చేశారు.

సమస్యలను సత్వరం పరిష్కరించండి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రజల సమస్యలను తెలుసుకొని సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులకు సూచించారు. గుడ్‌మార్నింగ్ ధర్మవరం కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 9వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్ల సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన డ్రెయిన్లను నిర్మించి ఆతర్వాత రోడ్లు నిర్మించాలని అధికారులకు సూచించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి పథకాల అమలుపై ఆరా తీశారు. పారదర్శకంగా పని చేయాలని సిబ్బందికి సూచించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వైస్‌చైర్మన్ పెణుజూరు నాగరాజు, వార్డు కౌన్సిలర్, సచివాలయ కన్వీనర్ మాసపల్లి సాయికుమార్‌తో పాటు 40వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

పీర్ల చావిడి నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సుప్రియ

తాడిమర్రి: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో పీర్ల చావిడి నిర్మాణానికి ధర్మవరం ఎమ్మెల్యే కే.వెంకటరామిరెడ్డి సతీమణి సుప్రియ రూ.50 వేల విరాళం ప్రకటించారు. ఈమేరకు ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు హనుమంతరెడ్డి, రాజేంద్రప్రసాద్, సన్నప్పయ్య, హరికి మంగళవారం నగదు అందించారు. రామాంజినేయులు, రాజప్ప, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్మిట్లు లేకపోతే బస్సులు సీజ్ చేస్తాం

కనగానపల్లి: పర్మిట్లు లేని స్కూల్ బస్సులు నడిపితే సీజ్ చేస్తామని కేసులు నమోదు చేస్తామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీవీ రమణ ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాన్ని హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన ఎంఈఓ అరుణమ్మతో కలసి ప్రైవేట్ పాఠశాలల యాజమానులతో సమావేశం నిర్వహించారు. బద్దలాపురం సమీపంలో స్కూలు వ్యాన్ బోల్తాకు గల కారణాలపై విచారించి, ఇందుకు సంబంధించి రోహిత్ పాఠశాల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

పంటల సాగుకు ప్రోత్సాహం



టమాట పంటను పరిశీలిస్తున్న రమణారెడ్డి

కొత్తచెరువు: చెన్నకేశవపురంలో ఆదర్శరైతు రాంభూపాల్ రెడ్డి ఆధునిక పద్ధతుల్లో సాగు చేసిన టమాట, చీనీ పంటలను జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి మంగళవారం పరిశీలించారు. రమణారెడ్డి మాట్లాడుతూ ఒకే పంటపై ఆధారపడకుండా టమాట, మిరప, బీర, తదితర పంటలవైపు మొగ్గుచూపాలని రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు పండించే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రైతులకు త్వరలో టార్పాలిన్లు, స్ప్రేయింగ్ మిషన్లు అందజేస్తామన్నారు.

భవన నిర్మాణాన్ని పూర్తి చేయండి

కనగానపల్లి: గ్రంథాలయ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ కాంట్రాక్టరుకు సూచించారు. మండలంలోని గ్రంథాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు, పుస్తకాలను పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని తనిఖీ చేశారు. పనులు పూర్తి చేసి గ్రంథాలయ శాఖకు అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మండల గ్రంథాలయాధికారి గోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ భాష అమృత భాష

పుట్టపర్తి: బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. లక్ష్మయ్య మాట్లాడుతూ అమ్మ భాష అమృత భాష అని, మాతృభాషను కాపాడుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్ స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని తెలుగు అధ్యాపకులు షమీవుల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: పోతులనాగేపల్లి మండల ప్రాథమికోన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు అన్నం అరవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

పుట్టపర్తి టౌన్: సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ 2023 మార్చి నెలలో ఆర్థిక సంవత్సరం ముగుస్తుందన్నారు. చాలా మంది ఆస్తి, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, మార్కెట్ సిస్తు చెల్లించలేదన్నారు. బకాయిలు ఉన్నవారు మార్చి 31లోపు ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో, లేదా మున్సిపల్, సచివాలయ కార్యాలయాల్లో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

కూలీలకు సదుపాయాలు కల్పించండి

ఓడీ చెరువు: చింతమానుపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ పోలప్ప మంగళవారం పరిశీలించారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎండలను దృష్టిలో పెట్టుకుని కూలీలకు తాగు నీరు, నీడ సదుపాయం కల్పించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఈఓఆర్డీ రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం కూలీలతో మాట్లాడారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

ఎన్పీకుంట: బాల్యవివాహాల నిర్మూలనకు అధికారులతో పాటు, ప్రజలు కూడా కృషి చేయాలని తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీఓ ఆదినారాయణ సూచించారు. బాల్యవివాహాల నిర్మూలనపై ప్రజా సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ సభాంగణంలో రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలపై టోల్ ఫ్రీ నంబర్1098కు సమాచారం ఇచ్చేలా జాగృతి కల్పించాలని సూచించారు. చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ క్రిష్ణమాచారి, కదిరి డివిజన్ కోఆర్డినేటర్ శ్రీనివాసులునాయుడు, సీడీపీఓ రాధిక, మండల వైద్యాధికారిణి డాక్టర్ షేక్ ఆసియా, ఎంఈఓ గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాళ్లు చెన్నకేశవప్రసాద్, రామరాజులు మంగళవారం తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు, ఇంటర్ అర్ధంతరంగా మానేసిన విద్యార్థులు ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

ముదిగుబ్బ: ఓపెన్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు స్థానిక ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ మురళీ తెలిపారు. అడ్మిషన్ల కొరకు ఈ నెల 26వ తేదిలోపు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

వినతిపత్రం అందజేత

ధర్మవరం: రేషన్ డీలర్ల దిగుమతి ఛార్జీలకు సంబంధించిన హైకోర్టు ఆర్డర్ కాపీని, వినతిపత్రాన్ని డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డికి మంగళవారం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకప్ప, స్టేట్ జాయింట్ కార్యదర్శి పరంధామరెడ్డి అందజేశారు. పుట్టపర్తి కార్యదర్శి చిన్న, డీలర్లు వెంకట్రాముడు, గంగిశెట్టి పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు

తాడిమర్రి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి ప్రశాంత్ మంగళవారం ఏకపాదంపల్లిలో వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మంచాన పడిన రోగుల ఇళ్లను సందర్శించి వైద్యం అందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం బాక్సులు చూపుతున్న సెబ్ అధికారులు

పుట్టపర్తి అర్బన్: వెంగళమ్మచెరువు గ్రామంలో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మాధవి తెలిపారు. ఎస్‌ఐ రాజన్నతో కలిసి మంగళవారం గ్రామంలో తనిఖీలు నిర్వహించి ఏలుకుంట్ల కేశవుల కుమారుడు చంద్రశేఖర్ వద్ద 20 బాక్సులు(1920 ప్యాకెట్లు), నాగరాజు భార్య లక్ష్మీ వద్ద 144 ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు చెప్పారు. మద్యం విలువ సుమారు రూ.72240 ఉంటుందని చెప్పారు.

నాయీబ్రాహ్మణ కమిటీ ఎంపిక

పుట్టపర్తి టౌన్: నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకారావ్ ఆదేశాల మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మాల్యవంతం మారుతీ ప్రసాద్, గౌరవ సలహాదారునిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్, కోశాధికారిగా కమ్మెతం రమేష్‌ను ఎన్నుకున్నారు. గోరంట్ల నాగభూషణ, గోపాల్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

నల్లచెరువు: రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన జోగన్నపేట సమీపంలో జరిగింది. తిరుపతి నుంచి గుంతకల్లు వెళ్తున్న ప్యాసింజర్ రైలుకు ఎదురుగా నిలబడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై రహీం తెలిపారు. వయసు 21-25 ఏళ్ల మధ్య ఉంటుందని, మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

నేటి నుంచి ఉత్సవాలు



పోతలప్పస్వామి విగ్రహం

పుట్టపర్తిటౌన్: పెద్దకమ్మవారిపల్లి సమీపంలో చింతతోపులో ఈనెల 22వతేదీ నుంచి 24 వరకు చెన్నకేశవ, పోతులప్ప, బంగారు లింగమయ్య స్వాముల ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయాలను ముస్తాబు చేశారు. 22న సాయంత్రం పుట్టపర్తి పుర వీధుల్లో ఎలువగంప ఉత్సవం, 23న ఉదయం 8 గంటలకు దాసంగాల మడుగు ఉత్సవం, రాత్రికి నాటక ప్రదర్శన, 24న ఉదయం 7 గంటలకు జ్యోతుల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సంఘాల పనితీరుపై ఆరా

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని మదర్‌థెరిస్సా మహిళా సంఘం సభ్యులతో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య మంగళవారం సమావేశం నిర్వహించారు. రూ.15 లక్షలకుపైగా రుణాలు తీసుకున్న సభ్యులు.. వాటిని ఏ విధంగా జీవనోపాధులకు వినియోగిస్తున్నారు, రుణాల చెల్లింపులు తదితర వాటిపై చర్చించారు. ఏపీఎం హేమలత పాల్గొన్నారు.